# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ వికసిత్ భారత్ నిర్మాణం కోసం దేశంలోని ప్రతి పౌరుడు నిబద్ధతతో పని చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.

- ❖ సాంకేతికతను సామాన్యుల జీవితంలో భాగంగా మార్చి.. వారి జీవనాన్ని మరింత సులభతరం చేయడమే నరేంద్ర మోదీ దార్శనికత అని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.

- ❖ యూపీఐ వ్యక్తిగత లావాదేవీలపై ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

- ❖ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆఫ్ఘనిస్తాన్ తో జరుగుతున్న చివరి టీ-20 క్రికెట్ మ్యాచ్ లో భారత్ 10 ఓవర్లు పూర్తయ్యే సరికి 142 పరుగులు చేసింది.

=====================

వికసిత్ భారత్ నిర్మాణం కోసం దేశంలోని ప్రతి పౌరుడు నిబద్ధతతో పని చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని యశోభూమిలో సెమీకాన్ ఇండియా-2026 సదస్సును ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారతదేశ సెమీకండక్టర్ ఎకోసిస్టమ్ వేగంగా విస్తరిస్తోందని, దీనివల్ల ఆవిష్కరణలు, పెట్టుబడులు, ఆర్థిక వృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. అదే విధంగా ఓ వైపు భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుండగా, మరోవైపు అంతర్జాతీయంగా భారత్‌పై విశ్వాసం కూడా పెరుగుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా సవాళ్లతో కూడిన పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. భారత్ 7.8 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని నరేంద్రమోదీ తెలియజేస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

ఇక ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ... సెమీకండక్టర్ రంగానికి అవసరమైన పునాదిని ఇప్పటివరకూ ఏర్పాటు చేశామని, తదుపరి దశలో సెమీకాన్ ఇండియా 2.0 ద్వారా పరిశ్రమ నిర్మాణంపై దృష్టి సారించనున్నామని తెలిపారు. సెమీకండక్టర్ అవసరాలకు సంబంధించిన వివిధ విభాగాల్లో భారత్‌లోనే చిప్‌ల రూపకల్పన చేసేలా కనీసం 200 స్టార్టప్‌లు, కంపెనీలకు మద్దతు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అశ్వినీ వైష్ణవ్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ ఆర్థిక, సాంస్కృతిక శక్తిగా శరవేగంగా ఎదుగుతోందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. మేడిన్ ఇండియా సెమీకండక్టర్ చిప్‌ల తయారీ నుంచి కాశీ, అయోధ్యల వైభవ పునరుద్ధరణ వరకు నేడు భారత్ సాంకేతికత, ప్రతిభతో పాటు తన గొప్ప సాంస్కృతిక వారసత్వం పట్ల గర్వాన్ని చాటుకుంటోందన్నారు. నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై కాశీలో `సేవా సంకల్ప్ అభియాన్` కార్యక్రమాన్ని రాజ్ నాథ్ సింగ్ కేంద్రమంత్రులు చిరాగ్ పాసవాన్, పంకజ్ చౌదరి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ... సాంకేతికతను సామాన్య పౌరుల జీవితంలో భాగంగా మార్చి, వారి జీవనాన్ని మరింత సులభతరం చేయడమే నరేంద్ర మోదీ దార్శనికత అని పేర్కొన్నారు. జన్‌ధన్, యూపీఐ, ఆయుష్మాన్ భారత్, 5జీ నెట్‌వర్క్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రధానమంత్రి భారత్‌ను 'వికసిత్ భారత్' సంకల్పం వైపు వేగంగా తీసుకెళ్తున్నారని చెప్పారు. ఈ చర్యలు ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేశాయని రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

యూపీఐ వ్యక్తిగత లావాదేవీలపై ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. యూపీఐ ద్వారా వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే అన్ని లావాదేవీలు ఉచితంగానే కొనసాగనున్నాయని తెలిపింది. స్నేహితులకు డబ్బు పంపడం, దుకాణాల్లో చెల్లింపులు చేయడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నగదు రహిత చెల్లింపులు జరపడం వంటి లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలు విధించరని పేర్కొంది. యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా నెలకు లక్ష రూపాయల వరకు ఆదాయం పొందే వ్యాపారులకు కూడా ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే, రూపే డెబిట్ కార్డుతో అనుసంధానమైన యూపీఐ లావాదేవీలన్నీ ఉచితంగానే కొనసాగుతాయని పేర్కొన్నాయి. వ్యక్తి నుంచి వ్యాపారికి జరిగే పి2ఎం యూపీఐ లావాదేవీల్లో దాదాపు 96 శాతం లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొన్నాయి. అయితే, రైల్వేలు, ఇంధనం వంటి అత్యవసర రంగాల్లో 2 వేల రూపాయలకు పైబడిన లావాదేవీలకు ప్రతి లావాదేవీపై 5 రూపాయల చొప్పున మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించనున్నారని పేర్కొంది. అదేవిధంగా, 2 వేల రూపాయలకు పైబడిన పెద్ద వ్యాపారుల లావాదేవీలకు మాత్రమే 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుందని ఈ అదనపు ఛార్జీలను వ్యాపారులే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

గత పన్నెండేళ్లలో దేశంలో డాప్లర్ వాతావరణ రాడార్ల సంఖ్య 14 నుంచి 51కి పెరిగిందని కేంద్ర భూ విజ్ఞాన శాస్త్రాల మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఒడిశాలోని సంబల్‌పూర్‌లో 51వ అత్యాధునిక డాప్లర్ రాడార్‌ను ఆయన ఈరోజు వర్చువల్‌గా ప్రారంభించారు. మిషన్ మౌసం కింద మరో 40 రాడార్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి తెలిపారు. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను పర్యవేక్షించడం, అర్థం చేసుకోవడం, వాటికి సమర్థంగా స్పందించే

సామర్థ్యాన్ని దేశంలో మరింత బలోపేతం చేయాలనే ప్రభుత్వ విస్తృత ప్రయత్నాల్లో భాగంగానే ఈ విస్తరణ చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రాథమిక ఉపాధ్యాయుల కోసం ఆరు నెలల సర్టిఫికేట్ బ్రిడ్జ్ కోర్సును కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు. బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ - బి.ఎడ్ పట్టా కలిగి, ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారి కోసం ఈ కోర్సును రూపొందించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు సమర్థవంతంగా బోధించేందుకు అవసరమైన నైపుణ్యాలు, సామర్థ్యాలను ఉపాధ్యాయుల్లో పెంపొందించేలా ఈ ప్రత్యేక వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమాన్ని రూపొందించినట్లు విద్యా మంత్రిత్వ శాఖ పేర్కొంది. పిల్లలే కేంద్రంగా, అందరికీ అందుబాటులో ఉండేలా, వారి వయోపరమైన అభివృద్ధికి అనుగుణంగా బోధించే విధానాలపై ఉపాధ్యాయులకు ఈ కోర్సు సమగ్ర శిక్షణ అందించనుంది.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం నేటితో మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. సంప్రదాయ వృత్తుల్లో నిమగ్నమైన 18 రకాల కళాకారులు, చేతివృత్తిదారులకు సమగ్ర సహాయం అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2023లో ఇదే రోజున ఈ పథకాన్ని ప్రారంభించారు. 30 లక్షల మంది లబ్ధిదారుల నమోదుతో ఈ పథకం కీలక మైలురాయిని సాధించింది. సంప్రదాయ విశ్వకర్మల నైపుణ్యాలను బలోపేతం చేయడంతో పాటు వారికి సంస్థాగత సహకారం, ఆధునిక పనిముట్లు, ఆర్థిక సహాయం, నైపుణ్యాభివృద్ధి, మార్కెట్ అనుసంధానం కల్పించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఇప్పటివరకు సుమారు 24 లక్షల 50 వేల మంది విశ్వకర్మలు ఈ పథకం కింద ప్రాథమిక నైపుణ్య శిక్షణ పొందారని కేంద్ర నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికత మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్-జీ రామ్ జీ పథకంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఈ పథకం ద్వారా అభివృద్ధి చెందిన గ్రామాల నిర్మాణానికి ఎలా దోహదపడవచ్చో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. వీ బీ జీ-రామ్-జీ పథకంపై నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ఈరోజు పాల్గొని ప్రసంగించారు. ఉపాధి కల్పించడంతో పాటు.. గ్రామీణ ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడే శాశ్వత ఆస్తుల సృష్టికి ఈ పథకం దోహదపడాలన్నారు. తద్వారా గ్రామాలు స్వయం సమృద్ధిగా, అభివృద్ధి చెందినవిగా మారేందుకు సహాయపడాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా భారత్ - అఫ్ఘానిస్థాన్ జట్ల మధ్య చివరి టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన అఫ్ఘానిస్థాన్ ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 12 ఓవర్లు పూర్తయ్యే 2 వికెట్లు నష్టపోయి 160 పరుగులు చేసింది. భారత బ్యాట్స్ మెన్లలో అభిషేక్ శర్మ సెంచరీ తో రాణించగా, సంజు శామ్‌సన్ 43 పరుగులతో క్రీజ్‌లో కొనసాగుతున్నాడు. మూడు టీ-20ల సిరీస్‌లో ఇప్పటికే భారత్ తొలి రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = =

ఆరో తరగతి విద్యార్థులకు తప్పనిసరి చేసిన మూడు భాషల విధానాన్ని 2027 విద్యా సంవత్సరం వరకు వాయిదా వేసే అంశాన్ని పరిశీలించాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ)కి సుప్రీంకోర్టు సూచించింది. విద్యార్థులు కొత్త విధానానికి సులభంగా అలవాటు పడేందుకు ఈ వాయిదా ఉపయోగపడుతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

అయితే, ప్రస్తుతం ఆరో తరగతిలో ఉన్న విద్యార్థుల్లో ఈ ఏడాదే మూడు భాషలను అభ్యసించాలనుకునే వారికి ఆ అవకాశం కొనసాగించాలని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =